సాక్షి
ఖమ్మం
బుధవారం । 9 । ఏప్రిల్ । 2025



ఈదురుగాలులతో నష్టం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వీచిన ఈదురుగాలులతో మామిడి సహా మొక్కజొన్న, వరి పంటలకు నష్టం వాటిల్లింది. 8లో



కల్తీ పాల దందా

ఆర్గానిక్ పేరుతో అమ్ముతున్న పాలల్లో కల్తీ జరుగుతోందని ఖమ్మంలోని ఓ షాప్ వద్ద వినియోగదారులు ఆందోళనకు దిగారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 39° / 25°

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రత నమోదవుతుంది. సాయంత్రం తర్వాత చల్లబడే అవకాశముంది.

న్యూస్‌రీల్

చాతకొండ బెటాలియన్ అభివృద్ధికి రూ.20 లక్షలు



కమాండెంట్‌కు లేఖ అందజేస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చాతకొండలోని ఆరో బెటాలియన్‌లో అభివృద్ధి పనుల కోసం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయించారు. ఈ మేరకు నిధుల కేటాయింపు లేఖను బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి, ఆర్ఐ జీ.వీ.రామారావుకు మంగళవారం ఖమ్మంలో అందజేశారు. ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేస్తే బెటాలియన్‌లో సెల్యూటింగ్ డయాస్, గ్యాలరీ నిర్మాణ పనులు చేపడతామని వారు వెల్లడించగా, ఎంపీ రూ.20లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా ఎంపీకి కమాండెంట్ కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి మే 10న పరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్/వైరా: తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు మే 10న పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ బి.రమ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం(ఇంగ్లిష్ మీడియం) ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూప్‌ల్లో ప్రవేశాలు ఉంటాయని వెల్లడించారు. మే 10న ఉదయం 10నుండి మధ్యాహ్నం 12–30గంటల జరిగే పరీక్ష కోసం విద్యార్థులు www.tgrjdc.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఇదే సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 040- 24734899, 94909 67222, 80081 18813 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వృత్తి శిక్షణా సంస్థల నుండి దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: క్రిస్టియన్ మైనార్టీలకు వివిధ రంగాల్లో వృత్తి శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలోని సంస్థల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ బి.పురంధర్ తెలిపారు. జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ గుర్తింపు లేదా కేంద్రప్రభుత్వ మైనార్టీ శాఖ ద్వారా ట్రైనింగ్ పార్టనర్‌గా ఉన్న సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. అర్హత కలిగిన సంస్థల బాధ్యులు పూర్తి వివరాలు, రెండు సెట్ల దరఖాస్తులను 'తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, గృహకల్ప రెండో అంతస్తు, ఎం.జే.రోడ్డు, నాంపల్లి, హైదరాబాద్‌లో ఈనెల 12 లోగా అందించాలని సూచించారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ

ఖమ్మంవైద్యవిభాగం: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై జిల్లాలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, ఉద్యోగులు శ్రద్ధ కనబర్చాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల)లకు మంగళవారం ఏర్పాటుచేసిన శిక్షణలో ఆమె మాట్లాడారు. మాతాశిశు సంక్షేమం, వ్యాధి నిరోధక టీకాలు, ఎయిడ్స్, లెప్రసీ, సంక్రమణ, అసంక్రమణ వ్యాధుల నిర్వహణ, క్షయ నివారణకు కృషి చేస్తూనే జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అంతేకాక వడదెబ్బ బారిన పడకుండా ప్రచారం చేయాలని, ఆస్పత్రుల్లో ఓపీ నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల అధికారులు డాక్టర్ రామారావు, డాక్టర్ చందునాయక్, డాక్టర్ సైదులు, డాక్టర్ వెంకటరమణ, వి.సుబ్రహ్మణ్యం, దుర్గ పాల్గొన్నారు.

నేడు వెటర్నరీ అసిస్టెంట్లకు పదోన్నతుల కౌన్సెలింగ్

ఖమ్మంవ్యవసాయం: పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించేందుకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జోన్–1 నుంచి జోన్–7 వరకు 373 మంది వెటర్నరీ అసిస్టెంట్ల(పశువైద్య సహాయకుల)లో అర్హులకు లైవ్ స్టాక్ అసిస్టెంట్లు(పశు సంపద సహాయకులు)గా పదోన్నతి కల్పిస్తారు. జోన్–4లోకి వచ్చే హన్మకొండ, వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుంచి 46 మంది అర్హత సాధించగా, బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి కౌన్సెలింగ్‌లో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటనారాయణతో పాటు మరో అసిస్టెంట్ డైరెక్టర్, కార్యాలయ మేనేజర్ పాల్గొననున్నారు. ఈమేరకు రోస్టర్ ఆధారంగా పదోన్నతుల ప్రక్రియ పూర్తిచేస్తారు.

జర్నీ.. జరభద్రం

జిల్లాలో ఇటీవల జరుగుతున్న ఆర్టీసీ బస్సు ప్రమాదాలు ప్రయాణికులను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఆర్టీసీపై నమ్మకంతో ప్రయాణికులు ఆదరిస్తుండగా.. అధికారులు సైతం అంతేస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నా ప్రమాదాలను పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారు. రహదారులపై విపరీతమైన రద్దీ పెరగడం, బస్సుల సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతుండడానికి తోడు కొందరు డ్రైవర్ల నిర్లక్ష్యం ఈ ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ ఏడాది మూడు నెలల కాలంలో ఖమ్మం రీజియన్ పరిధిలో 18 ప్రమాదాలు జరగ్గా.. ఎనిమిది మంది మృతి చెందారు. ఇవి ఎక్కువగా అద్దె బస్సుల కారణంగానే జరగడంతో డ్రైవర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఉండడం లేదనే చర్చ సాగుతోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



మార్చి 5న తనికెళ్ల వద్ద బోల్తా పడిన రాజధాని బస్సు (ఫైల్)

జిల్లాలో కలవరపెడుతున్న ఆర్టీసీ బస్సు ప్రమాదాలు

- రద్దీగా అనుగుణంగా పెరగని బస్సుల సంఖ్య
- ఫలితంగా డ్రైవర్లకు ఓటీ.. అద్దె బస్ డ్రైవర్లకు శిక్షణ మాత్రమే

సరిపడా బస్సులేవీ?

మహాలక్ష్మి పథకం ద్వారా రీజియన్‌లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అందుకు అనుగుణంగా బస్సులు మాత్రం సమకూరలేదు. ఒకటి, అరా బస్సులను డిపోలకు కేటాయించడంతో ఒక్కో బస్సులో 60 – 80 మంది వరకు ప్రయాణిస్తున్నారు. కొన్ని రూట్లలో రాత్రి ఏడు గంటలు దాటాక అరకొర సర్వీసులు ఉండడంతో రద్దీ మరింత పెరుగుతోంది. ఇక ప్రయాణికుల వినతితో డ్రైవర్లు అన్నిసార్లు కాకపోయినా కొన్నిసార్లు ఆపుతూ వెళ్లాల్సి రావడంతో గమ్యస్థానం చేరే సరికి ఆలస్యమవుతోంది. ఆపై మళ్లీ తెల్లారి డ్యూటీ ఉండడం.. ఓవర్ టైమ్ డ్యూటీలు వేస్తుండడంతో తగినంత విశ్రాంతి లభించక ఏకాగ్రత తగ్గుతోంది.

అద్దె బస్సులే అధికం

జిల్లాలో అధికంగా అద్దె బస్సులే ప్రమాదాలకు గురవుతున్నాయి. వీటి డ్రైవర్లు నిర్లక్ష్యంగా నడుపుతున్నారని, ఓవర్ టేక్ సమయాన తగిన జాగ్రత్తలు తీసుకోకపోగా.. ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడుపుతున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. ఇంకొందరు డ్రైవర్లు ఇయర్ ఫోన్లు పెట్టుకుని పాటలు వింటూ డ్రైవింగ్ చేస్తుండడం కూడా ప్రమదాలకు కారణమవుతోందని తెలుస్తోంది. గతంలో అద్దె బస్సు డ్రైవర్లకు వరంగల్‌లో శిక్షణ ఇచ్చినా, ఇప్పుడు ఆ పరిస్థితులు లేక నైపుణ్యం కొరవడుతోంది.

ఖమ్మం రీజియన్‌లో కేటగిరీల వారీగా బస్సులు

రాజధాని	36
లహరి ఏసీ	04
లహరి నాన్ ఏసీ	06
సూపర్ లగ్జరీ	87
డీలక్స్	40
ఎక్స్‌ప్రెస్	182
పల్లెవెలుగు	192
జేఎన్ఆర్‌యూఎం	05
మినీ బస్సులు	04
మొత్తం	556

అతి వేగం..

అతివేగం వాహనదారుల ప్రాణాల మీదకు తీసుకొస్తోంది. కరోనా తర్వాత సొంత వాహనాల సంఖ్య పెరగగా, వాహనాల రద్దీ అదే స్థాయిలో నమోదవుతోంది. వ్యక్తిగత వాహనాలను నడిపే పలువురికి డ్రైవింగ్ సామర్థ్యం లేకపోవడం, మరోవైపు ఆర్టీసీ బస్సుల వేగం ఎక్కువగా ఉండడం, అద్దె బస్సుల డ్రైవర్లలో కొందరి నిర్లక్ష్యం తరచుగా ప్రమాదాలకు తావిస్తోంది.

మూడు నెలల్లో 18 ప్రమాదాలు

ఖమ్మం రీజియన్ పరిధిలోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు డిపోల పరిధిలో ప్రతిరోజు 556 బస్సులు.. 2.38 లక్షల కి.మీ. మేర రాకపోకలు సాగిస్తాయి. మొత్తంగా 238 అద్దె బస్సులు ఉండగా, అన్నింటా కలిపి 737 మంది డ్రైవర్లు, 865 మంది కండక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు ఆర్టీసీలో 18 రోడ్డు ప్రమాదాలు జరగగా.. జనవరి, ఫిబ్రవరిల్లో మూడేసి ప్రమాదాలు జరిగాయి. కానీ మార్చిలోనే ఏకంగా 12 ప్రమాదాలు జరిగాయి. అన్ని ఘటనల్లో కలిపి ఎనిమిది మంది మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు.

డ్రైవర్ల విధినిర్వహణపై పరిశీలన



బస్సు ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూనే డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నాం. అలాగే, ప్రతిరోజు డ్యూటీకి వెళ్లే సమయాన ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా బస్సు నడుపుతామని ప్రతిజ్ఞ చేయిస్తున్నాం. అంతేకాక పాల్వంచ పెద్దమ్మగుడి నుంచి ఖమ్మం వరకు కొన్ని ప్రాంతాల్లో అధికారులతో పరిశీలన చేయిస్తున్నాం. డ్రైవర్లు బస్ ఏ వేగంతో నడుతున్నారు, ఇయర్ ఫోన్‌లో పాటలు వింటున్నారా, ఫోన్‌లో మాట్లాడుతున్నారా అనేది పరిశీలించాక డిపో మేనేజర్లకు నివేదిక పంపిస్తాం. ఆపై వారు దిద్దుబాటు చర్యలు తీసుకుంటారు.

– ఎ.సరిరాం, ఖమ్మం రీజినల్ మేనేజర్

డిపోల వారీగా బస్సుల సంఖ్య	ఖమ్మం	మధిర	సత్తుపల్లి	భద్రాచలం	కొత్తగూడెం	మణుగూరు	ఇల్లెందు
	136	62	107	97	61	70	23

శ్రద్ధగా చదివి ఉద్యోగాలు సాధించండి..

అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



బ్యాటరీ కారుపై వెళ్తూ అర్బన్ పార్క్‌లో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

సత్తుపల్లిటౌన్: 'ఏ పరీక్షకు సిద్ధమవుతున్నారు.. సమయం సరిపోతోందా.. అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా.. ఏమైనా సదుపాయాలు కావాలన్నా కల్పిస్తాం.. శ్రద్ధగా చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగాలకు ఎంపిక కండి' అని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ సూచించారు. సత్తుపల్లిలోని మోడ్రన్ లైబ్రరీని మంగళవారం సందర్శించిన ఆమె అక్కడి అభ్యర్థులతో మాట్లాడారు. సెలవు రోజుల్లో మూసివేస్తుండడంతో ఇబ్బంది పడుతున్నామని పలువురు చెప్పగా అన్ని రోజులు తెరిచి ఉంచాలని లైబ్రేరియన్ మల్లికార్జున్‌ను ఆదేశించారు. ఉదయం 7నుంచి రాత్రి 7గంటల వరకు పనిచేసేలా ఉద్యోగులు సమయం సర్దుబాటు చేసుకోవా లని, మాక్‌టెస్టుల నిర్వహణకు నాలుగు కంప్యూటర్లను సమకూర్చి ఇంటర్నెట్ స్పీడ్ పెంచాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సత్తుపల్లిలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న మోడ్రన్ ధోబీఘాట్‌ను జూలై కల్లా పూర్తి చేసి యంత్రాలు సమకూర్చాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. ధోబీఘాట్‌తో పాటు ఎన్టీఆర్‌నగర్‌లో రూ.1.48 కోట్లతో నిర్మిస్తున్న యూపీహెచ్‌సీని పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఆతర్వాత స్వామి వివేకానంద ఎక్సలెన్స్ భవనంలో తనిఖీ చేసి మిగిలిన పనులు పూర్తి చేయాలని తెలిపారు. అర్బన్ పార్క్‌లో బ్యాటరీకారుపై కలియదిగిగిన ఆమె పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు సమకూర్చాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం, ఎస్టీ బాలుర, ఎస్సీ బాలికల హాస్టళ్లను సైతం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ నర్సింహ, రేంజర్ స్నేహలత, ఎంపీడీఓ ఆర్.చిన్ననాగేశ్వరరావు, ఏఈ సురేష్, మేనేజర్ మైసా శ్రీనివాసరావు, హెచ్‌డబ్ల్యూఓలు రాములు, దారుగాబి, ఎంపీఈఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా సరిపోవడం లేదు..

మూల్యాంకనానికి ఉపాధ్యాయుల కొరత

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం కొనసాగుతోంది. స్పాట్ వాల్యూయేషన్‌కు మొత్తం 650మంది ఉపాధ్యాయుల అవసరం ఉండగా... ఇప్పటి వరకు 620మందే రిపోర్ట్ చేశారు. సోమవారం కీలక సబ్జెక్టులైన సోషల్, ఇంగ్లిష్, బయాలజీ, హిందీ జవాబుపత్రాల మూల్యాంకనానికి 78మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు తక్కువగా ఉండడంతో భద్రాద్రి జిల్లా ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. అయితే, మంగళవారం కూడా సోషల్ సబ్జెక్ట్ మూల్యాంకనానికి 30మంది ఉపాధ్యాయులు తక్కువ పడడంతో గురుకులాల ఉపాధ్యాయులను తీసుకుంటున్నామని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. వీరంతా బుధవారం విధులకు హాజరవుతారని వెల్లడించారు. కాగా, మూల్యాంకన కేంద్రాన్ని జిల్లా పరిశీలకుడు శ్రీనివాసాచారి మంగళవారం పరిశీలించి సూచనలు చేశారు.

23ఏళ్ల నాటి ట్యాంక్ కూల్చివేత

మండలంలోని పైనంపల్లి ప్రజల తాగునీటి అవసరాల కోసం 2002లో 1.20 లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మించగా శిథిలావస్థకు చేరింది. దీంతో ఐదేళ్ల నుంచి వినియోగించడం లేదు. అయితే, ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉండడంతో పంచాయతీ తీర్మానం మేరకు మంగళవారం కూల్చివేశారు. పంచాయతీ కార్యదర్శి నందా నర్సింహారావు ఆధ్వర్యాన నిపుణుల పర్యవేక్షణలో బాంబులు పెట్టి ట్యాంక్‌ను కూల్చివేయగా ఐదు నిమిషాల్లో నేలమట్టమైంది. ఈ సమయాన పరిసర ప్రాంత ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. - నేలకొండపల్లి



శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్



బాంబులు పెట్టడంతో కూలుతూ...



నేలమట్టమైన ట్యాంక్

పేదలందరికీ సంక్షేమ పథకాలు

- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి
- మేడేపల్లిలో వంతెనకు శంకుస్థాపన, కేజీబీవీలో భోజనం



కేజీబీవీలో బాలికలతో కలి సి భోజనం చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాందాస్

ఏన్కూరు: రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి స్పష్టం చేశారు. అయితే, అభివృద్ధి, సంక్షేమాన్ని ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని ఆయన సూచించారు. ఏన్కూరు మండలం మేడేపల్లిలో పీఎంజేఎస్‌వై నిధులు రూ.4.50 కోట్లతో నిర్మించనున్న హై లెవల్ వంతెనకు ఎంపీ మంగళవారం శంకుస్థాపన చేశారు. అలాగే, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్త్రీ టీ స్టాల్‌ను ప్రారంభించి నిర్వాహకులు నాగేంద్రమ్మను అభినందించారు. ఆతర్వాత ఎంపీ మాట్లాడుతూ హెచ్‌సీయూ భూముల విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని సూచించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చడంతో వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రుణమాఫీ కాని రైతుల విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేస్తోందని వెల్లడించారు. కాగా, జిల్లాను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతానని ఎంపీ తెలిపారు. అనంతరం రేపల్లెవాడ సమీపంలోని రాజీవ్ లింక్ కెనాల్ పనులను పరిశీలించిన ఎంపీ, ఏన్కూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. వంటగదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించాక మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను ఆరా తీశారు. ఆపై వారితో కలిసి పాఠశాలలోనే భోజనం చేశారు. ఈకార్యక్రమాల్లో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరావు, పంచాయతీరాజ్ ఈఈ వెంకటరెడ్డి, డీఈ కరుణాకర్‌రెడ్డి, నాయకులు గుత్తా వెంకటేశ్వరావు, వేములు కృష్ణప్రసాద్, స్వర్ణ నరేందర్, మేడ ధర్మారావు, చందూలాల్, భూక్యా లాలు, వాసిరెడ్డి నాగేశ్వరావు, కొప్పుల ప్రభావతిరెడ్డి, వాసిరెడ్డి నాగేశ్వరావు, తాళ్లూరి నవీన్, దళపతి భువనేశ్వర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు రశీదు ఇవ్వండి..

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారికి రశీదు ఇవ్వాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణను మంగళవారం ఆయన పరిశీలించారు. పలువురు దరఖాస్తుదారులతో మాట్లాడి ఏ యూనిట్‌ను ఎంచుకున్నారు, అందులో ఎంత మేర అనుభవం ఉందని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ వరకు గడువు ఉందని, ఆన్‌లైన్‌లో సమస్య ఎదురైతే మున్సిపాలిటీ లేదా ఎంపీడీఓ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తులు ఇవ్వొచ్చని తెలిపారు. కేఎంసీలో ఐదు కౌంటర్ల ద్వారా దరఖాస్తు తీసుకుంటున్నందున సామాజికవర్గాల వారీగా రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలని ఉద్యోగులకు కలెక్టర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా, సుజాత పాల్గొన్నారు.

24గంటల్లోగా మిల్లులకు ధాన్యం

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



కల్లూరు రూరల్ : పుల్లయ్యబంజరులో ధాన్యం తేమశాతాన్ని పరీక్షిస్తున్న అదనపు కలెక్టర్

తల్లాడ/పెనుబల్లి/వేంసూరు/కల్లూరు రూరల్: కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లోగా రైస్ మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. తద్వారా అకాల వర్షాల నుంచి పంటను కాపాడొచ్చని తెలిపారు. తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు మండలాల్లో మంగళవారం పర్యటించిన ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేయడంతో పాటు కొత్త రేషన్‌కార్డు దరఖాస్తుల పరిశీలనపై ఆరా తీశారు. ఈ మేరకు పెనుబల్లి మండలం నూతనకల్‌లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు గన్నీ బ్యాగ్‌లు, టార్పాలిన్ సంచులు, తేమ యంత్రాలు, వేయింగ్ మిషన్లు అందుబాటులో పెట్టాలని తెలిపారు. ఆతర్వాత మిట్టపల్లిలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుదారుల విచారణను పరిశీలించారు. పెనుబల్లి మండలం లంకాసాగర్ క్రాస్‌లోని రైస్ మిల్లును తనిఖీ చేయగా.. రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం తీసుకోవాలని, రబీ సీజన్ సీఎంఆర్ గడువులోగా అందించాలని సూచించారు. అక్కడి తహసీల్‌కు వెళ్లి రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ఇక వేంసూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, తహసీల్‌ను తనిఖీ చేశారు. అలాగే, కల్లూరు మండలం పుల్లయ్యబంజరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్, కల్లూరు ఆర్డీఓ రాజేందర్, నూతనకల్ సొసైటీ అధ్యక్షుడు తూము వీరభద్రరావు, సీఈఓ రాకేష్, తహసీల్దార్లు గంటా ప్రతాప్, బాబ్జీప్రసాద్, పులి సాంబశివుడు, ఏఓలు తాజుద్దీన్, ఎం.రూప, దీపిక, ఉమామహేశ్వరరావు ఆర్ఐలు విజయ్‌భాస్కర్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ ఉంటేనే రిజిస్ట్రేషన్

- ప్రతీ డాక్యుమెంట్‌కు తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- పైలట్ ప్రాజెక్టుగా ఉమ్మడి జిల్లాలో మూడు కార్యాలయాలు
- ఈనెల 10 నుండి నూతన విధానం అమలు



ఖమ్మంలోని జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతీ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ పారదర్శకంగా ఉండేలా చేస్తూనే త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలోనే డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్ విధానాన్ని తప్పనిసరి చేస్తున్నట్లు ఇటీవల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. తొలుత 19 కార్యాలయాల్లో ఈనెల 10వ తేదీ నుంచి నూతన విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలుచేయనున్నారు. ఈ జాబితాలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్థానం దక్కింది.

మూకుమ్మడిగా చేయకుండా..

ప్రస్తుతం ఎవరు ముందు వస్తే వారు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. అంతేకాక దళారులు పదుల సంఖ్యలో డాక్యుమెంట్లు తీసుకొచ్చి వరుసగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటుండడంతో మిగతా వారి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో స్లాట్ బుకింగ్ విధానం అమలుచేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 19 కార్యాలయాలను పైలట్‌గాఎంపిక చేయగా.. ఖమ్మం ఆర్‌ఓ(జాయింట్ సబ్ రిజిస్ట్రార్) కార్యాలయం, కూసుమంచి, కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈనెల 10వ తేదీ నుంచి నూతన విధానం అమలు కానుంది. గతంలో స్లాట్ బుకింగ్ విధానం ఉన్నా.. పూర్తిస్థాయిలో అమలు కాలేదు. సేల్, మార్ట్‌గేజ్ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ మినహా ఇతర డాక్యుమెంట్లకు స్లాట్ బుక్ చేసిన దాఖలాలు లేవు. కానీ ప్రభుత్వం ఇప్పుడు పారదర్శకత కోసం స్లాట్ బుకింగ్ విధానాన్ని తప్పనిసరి చేసింది. ఈ విధానంతో ఒకేసారి 30–40 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసే వీలు ఉండదని.. ఒక స్లాట్‌లో ఒకే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ జరుగుతుందని చెబుతున్నారు.

రోజుకు 48 డాక్యుమెంట్లు

కొత్త విధానంలో రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారు ముందుగా సమయం నిర్ణయించుకుని స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంది. ఆ సమయానికి కాస్త ముందు వస్తే 10 నుంచి 15 నిమిషాల్లో పని పూర్తిచేసుకుని వెళ్లిపోవచ్చు. రోజుకు 48 డాక్యుమెంట్లే రిజిస్ట్రేషన్ చేసేలా ప్రభుత్వం నిర్దేశించింది. ఉదయం 10–30నుండి మధ్యాహ్నం 1–30 గంటల వరకు 24, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5గంటల వరకు 24 డాక్యుమెంట్ల చొప్పున స్లాట్‌లు కేటాయిస్తారు. స్లాట్ బుక్ చేసుకోలేని అత్యవసరమైన వారికి సాయంత్రం 5నుండి 6 గంటల వరకు సమయం ఇస్తారు. కానీ ఈ సమయంలో ఐదు డాక్యుమెంట్ల కన్నా ఎక్కువ రిజిస్ట్రేషన్ చేయడానికి వీలు లేదు. 'వాక్ ఇన్ రిజిస్ట్రేషన్' పేరుతో వీటికి అనుమతి ఇవ్వనుండగా.. కార్యాలయానికి ఎవరు ముందు వస్తే వారికి అవకాశం కల్పిస్తారు.

క్లుప్తంగా

అధ్యాపకురాలికి డాక్టరేట్


జ్యోతిర్మయి రాణి

నేలకొండపల్లి/ఖమ్మం అర్బన్: నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కవ్వంపల్లి జ్యోతిర్మయిరాణికి డాక్టరేట్ లభించింది. ఖమ్మం ఖానాపురానికి చెందిన ఆమె ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వి.నాగరాజు పర్యవేక్షణలో 'వివిధ రకాల మెట్రిక్ స్థలాల్లో నిర్దిష్ట స్థిర బిందు సిద్ధాంతాలు – అనుసంధాన స్థిర బిందు సిద్ధాంతాలు – వాటి ఉపయోగాలు' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంధానికి ఓయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈసందర్భంగా మంగళవారం జ్యోతిర్మయిరాణిని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు, ఉద్యోగులు సన్మానించగా, తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గోపి, డాక్టర్ జె.రమేష్ తదితరులు అభినందించారు.

'యువిక'కు దమ్మపేట గురుకులం విద్యార్థి


ఉదయ్

దమ్మపేట/నేలకొండపల్లి: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ నిర్వహిస్తున్న యువ విజ్ఞాని కార్యక్రమ్(యువిక)కు నేలకొండపల్లి మండలంలోని బైరవునిపల్లికి చెందిన విద్యార్థి బారి ఉదయ్ ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన బారి వెంకన్న–సునీత దంపతుల కుమారుడు ఉదయ్ దమ్మపేటలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ పాఠశాల విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆసక్తి పెంచేందుకు 'యువిక' కార్యక్రమం నిర్వహిస్తుండగా 15రోజుల శిక్షణకు ఆయన ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఉదయ్‌ను జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఎం.ధనలక్ష్మి, గ్రామస్తులు పోలంపల్లి నాగేశ్వరరావు, మరికంటి ఉమ తదితరులు అభినందించారు.

రెండు ఉద్యోగాలు సాధించిన యువతి


నైమిష

మధిర: మండలంలోని దెందుకూరుకు చెందిన గుర్రం కళాధర్ కుమార్తె నైమిష రెండు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. గత ఏడాది స్టాఫ్ సెలక్షన్ కమిటీ నిర్వహించిన పరీక్షలకు హాజరుకాగా ఇటీవల ఫలితాలు వెల్లడయ్యాయి. దీంతో ఆదాయ పన్ను శాఖ, హోం శాఖలో అధికారిగా ఆమె ఉద్యోగాలకు ఎంపికైంది. ఏదైనా ఒక ఉద్యోగం ఎంచుకుని ఈనెల 10న చేరనున్నట్లు నైమిష వెల్లడించింది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఆమె కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికవడంపై పలువురు అభినందించారు.

'రాజీవ్ యువవికాసం'పై అవగాహన

ఖమ్మం మామిళ్లగూడెం: రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులంతా దరఖాస్తు చేసుకునేలా కుల సంఘాల నాయకులు కృషి చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు పురందర్, జి.జ్యోతి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో పాటు బీసీ, ఎంబీసీ నాయకులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రేషన్‌కార్డు లేకపోతే ఇన్‌కం సర్టిఫికెట్ అవసరమవుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో సమస్య ఎదురైతే దరఖాస్తులను మండల, మున్సిపల్ కార్యాలయాల్లో ఈనెల 14లోగా అందించాలని సూచించారు. సమాచారం కోసం సంబంధిత కార్యాలయాల్లో సంప్రదించాలే తప్ప దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు.

అటు విద్యుత్ కోత.. ఇటు గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మంలో మంగళవారం రాత్రి గాలిదుమారం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇదే అదునుగా దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. మామిళ్లగూడెంలోని వీవీసీ ఫంక్షన్ హాల్ సమీపాన నివాసముండే విజయ రోజులాగే రామాలయం సెంటర్‌లోని టైలరింగ్‌లో దుకాణంలో పని ముగించుకుని వస్తోంది. ఇంటి సమీపానికి చేరుతుండగా కరెంట్ పోవడంతో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన దుండుగుడు కత్తితో బెదిరించి ఆమె మెడలోని రెండున్నర తులాలు గొలుసు లాక్కుని పారిపోయాడు. బాధితులు కేకలు వేస్తుండగానే దుండగుడు క్షణాల్లో మాయమయ్యాడు. ఈమేరకు ఖమ్మం టుటౌన్ పోలీసులకు బాధితురాలు విజయ ఫిర్యాదు చేయగా సీపీఎస్ ఏసీపీ సర్వర్, సీఐ బాలకృష్ణ, సిబ్బంది చేరుకుని విచారణ చేపట్టారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	1,950
పెసలు	7,500	5,600
కందులు	6,500	6,500
అలసంద	6,100	6,100
మిర్చి	13,500	6,000
మిర్చి తాలు	5,500	4,000
పత్తి	7,250	6,400

– ఖమ్మం వ్యవసాయం

ఈదురుగాలులతో అపారనష్టం

- పలుచోట్ల నేలవాలిన పంటలు
- మామిడికాయలు రాలడంతో రైతుల ఆందోళన

సత్తుపల్లి/వేంసూరు/కల్లూరు రూరల్: సత్తుపల్లి నియోజకవర్గంలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈదురుగాలులతో కూడిన వర్షం కువడంతో రైతులకు నష్టం ఎదురైంది. మంగళవారం సాయంత్రం కూడా ఇదే పరిస్థితి కనిపించింది. ఈదురుగాలుల ప్రభావంతో సత్తుపల్లి మండలం పాకలగూడెంలో సూరిశెట్టి రామారావుకు చెందిన నాలుగు ఎకరాల అరటితోట నేలవాలగా, రుద్రాక్షపల్లిలో ధరావత్ కృష్ణకు చెందిన 30ఎకరాల మామిడితోటలో కాయలు నేలరాలాయని వాపోయారు. గంగారంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవడంతో రైతులు తిరిగి ఆరబోశారు. ఇక వేంసూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి ఎదురైంది. శంభునిగూడెంలో మూడెకరాల మొక్కజొన్న పంట పడిపోవడంతో మంగళవారం అధికారులు పరిశీలించారు. మొత్తంగా 120 ఎకరాల్లో వరి, 180 ఎకరాల్లో మామిడి, 220 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నాయని ప్రాథమికంగా గుర్తించారు. అలాగే, కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో కూడా మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. ఈ కాయలు దెబ్బతినడంతో అమ్మే పరిస్థితి లేక నష్టపోయినట్లేనని రైతులు ఆవేదన చెందుతున్నారు.


సత్తుపల్లి : గంగారంలో ధాన్యం తడవడంతో ఆరబోసిన దృశ్యం


సత్తుపల్లి : నేలవాలిన అరటి తోట


వేంసూరు : కిందపడిన మొక్కజొన్న పంట


కల్లూరు రూరల్ : నేలరాలిన మామిడికాయలు

దెబ్బతిన్న పంటలు పరిశీలన

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలో సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి బుచ్చిరెడ్డిపాలెం, మామునూరు, వెంకటాపురం, నారాయణపురం, సఖినవీడు, తదితర గ్రామాల్లో మొక్కజొన్న చేన్లు దెబ్బతిన్నాయి. అలాగే, మామిడితోటల్లో కాయలు నేల రాలగా, ఏఓ శివసాయి, ఉద్యానవన అధికారి విష్ణు పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టంపై ఆరా తీశారు. ఏఈఓలు కూరెళ్ల వంశీకృష్ణ, కృష్ణకుమారి పాల్గొన్నారు.


ఎర్రుపాలెం : మొక్కజొన్న తోటను పరిశీలిస్తున్న ఏఈఓ వంశీకృష్ణ

కల్తీ పాల దందా..

- విక్రేతలపై కొనుగోలుదారుల ఆగ్రహం
- శాంపిళ్లు సేకరించిన ఆహార తనిఖీ అధికారులు


పాలగడ్డలు చూపిస్తున్న రామారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్గానిక్ పేరుతో కల్తీ పాలు విక్రయిస్తున్నారంటూ పలువురు ఖమ్మంలోని ఓ పాల విక్రయ కేంద్రం వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. ఖమ్మం ఏసీపీ కార్యాలయం ఎదుట బొమ్మిశెట్టి నేలన్న సమగ్ర సేంద్రియ వ్యవసాయ వేదిక పేరిట ఏర్పాటుచేసిన షాపులో కొన్నాళ్లుగా కొనుగోలు చేస్తున్న పాలు వేడి చేయగానే గడ్డ కడుతున్నాయని ఆరోపించారు. ఈమేరకు బ్యాంక్ కాలనీకి చెందిన కొల్లు రామారావు మంగళవారం లీటరు పాలు రూ.90తో కొనుగోలు చేయగా, ఇంట్లో వేడి చేయగానే గడ్డ కట్టగానే వాసన వచ్చిందని తెలిపారు. దీంతో కేంద్రానికి వచ్చిన ఆయన విక్రయదారులను నిలదీశాడు. ఈ విషయమై ఆహార తనిఖీ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు చేరుకుని శాంపిళ్లు సేకరిస్తుండగానే మరో ఇద్దరు వచ్చి ఇదే అంశంపై ఫిర్యాదు చేశారు. ఇక ఆర్గానిక్ తేనె అంటూ కల్తీ జరిగిందని అంటగట్టారని షాప్ నిర్వాహకులపై ఖమ్మంకు చెందిన పరమేశ్వర్ అదే సమయాన ఫిర్యాదు చేయడం గమనార్హం.


విక్రయ కేంద్రంలో పాలు, పెరుగు శాంపిళ్లు సేకరిస్తున్న అధికారులు

కేఎంసీలో మహిళ ఫిర్యాదు

గొల్లగూడెం రోడ్డులోని ఓ డెయిరీ వద్ద అమ్మే పాలలో కల్తీ చేస్తున్నారని కేఎంసీలోని ఆహార తనిఖీ అధికారులకు మౌనిక అనే మహిళ ఫిర్యాదు చేసింది. చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంటున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

కల్తీమయం..

జిల్లా కేంద్రంలో వ్యాపారులు లైసెన్స్ తీసుకోకపోవడమే కాక కల్తీ వస్తువులు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని, అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరుగుతోందని ఆరోపిస్తున్నారు. కల్తీపాలు విక్రయించారని ఆరోపణలు వచ్చినబొమ్మిశెట్టి నెలన్న సమగ్ర సేంద్రియ వ్యవసాయ వేదికకు కూడా నిర్వాహకులు అనుమతి కానీ లైసెన్స్ కానీ తీసుకోలేదని గుర్తించారు. అయితే, ఈ షాప్ వద్ద మంగళవారం వినియోగదారులు ఆందోళన చేస్తున్న సమయాన అక్కడికి వచ్చిన ఆహార తనిఖీ అధికారులు, సిబ్బంది అందరినీ మేనేజ్ చేసుకోవాలని వ్యాపారికి సలహా ఇచ్చినట్లు పలువురు ఆరోపించారు.

శాంపిళ్లు సేకరించాం..

బొమ్మిశెట్టి నేలన్న సమగ్ర సేంద్రియ వ్యవసాయ వేదికలో పాలు, తేనె కల్తీ జరుగుతోందన్న ఫిర్యాదులతో శాంపిళ్లు సేకరించాం. గొల్లగూడెం రోడ్డులోని ఓ షాప్‌లో కూడా శాంపిళ్లు తీసుకున్నాం. హైదరాబాద్ ల్యాబ్ నుంచి 15 రోజుల్లోగా ఫలితాలు వస్తాయి. అంతేకాక లైసెన్స్ లేకుండా పాలు విక్రయిస్తున్న వారు 15 రోజుల్లోగా లైసెన్స్ తీసుకోవాలని ఆదేశించాం.

– ఆర్.కిరణ్‌కుమార్, జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్

సన్న బియ్యం.. సకల జనుల ఆసక్తి

ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా ఈనెల నుంచి సన్న బియ్యం పంపిణీ ఆరంభించింది. దీంతో కార్డు ఉన్నా ఇన్నాళ్లు రేషన్ షాపులకే వెళ్లని పలువురు కూడా ఈసారి ఆసక్తి కనబరుస్తున్నారు. బియ్యం తిన్నా, తినకపోయినా సన్నబియ్యం ఎలా ఉంటాయోననే ఆసక్తితో తీసుకునేందుకు వస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని పలు రేషన్‌షాపుల వద్ద మునుపెన్నడూ లేని విధంగా క్యూలైన్లు కనిపిస్తుండడం విశేషం.– స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ఖానాపురం కాల్వకట్ట రేషన్ షాపు వద్ద..

విద్యార్థి చికిత్సకు ఉపాధ్యాయుల చేయూత

పెనుబల్లి: విద్యార్థులకు పాఠాలు చెప్పడమే కాదు.. ఆపదలో వారికి అండగా నిలుస్తామని ఉపాధ్యాయులు నిరూపించారు. రోడ్డుప్రమాదంలో గాయపడిన విద్యార్థికి చికిత్స చేయించడంలో నిరుపేదలైన తల్లిదండ్రులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని తెలిసి ఎంఈఓ సహా ఉపాధ్యాయులు రూ.లక్ష నగదు సమకూర్చారు. వివరాలు... మండలంలోని చౌడవరం గ్రామానికి చెందిన తొమ్మిది తరగతి విద్యార్థి సడియం వంశీ సోమవారం వీఎం బంజర జెడ్పీహెచ్‌ఎస్ నుంచి సైకిల్‌పై ఇంటికి వెళ్లే క్రమాన లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను మెరుగైన వైద్యం కోసం హైదరబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స ఖర్చుల కోసం ఎంఈఓ సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు రూ.65 వేలు సమకూర్చారు. మండలంలోని మిగిలిన పాఠశాలల ఉపాధ్యాయులు రూ.35వేలు ఇవ్వగా, మొత్తం రూ.లక్షల నగదును ఆస్పత్రి యాజమాన్యానికి చెల్లించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వీ.వీ.రామారావు, వనమా నాగేశ్వరరావు, జి.వీరస్వామి, నాళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎంఈఓకు నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

'బీజేపీ తీరుతో రాజ్యాంగానికి ముప్పు'


మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్‌రెడ్డి, పక్కన డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు

'సంవిధాన్' సమావేశాల్లో కాంగ్రెస్ నేతలు

మధిర/ఎర్రుపాలెం: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తీరుతో రాజ్యాంగానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున, ప్రతిఒక్కరు ఆ పార్టీ తీరును ఎండగట్టాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రావణ్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మధిర, ఎర్రుపాలెంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణుల సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు రక్షణగా ఉన్న రాజ్యాంగాన్ని నిర్వీర్యం బీజేపీ పెద్దలు ప్రయత్నిస్తున్నారని, ఇందుకు ఉదాహరణగా కేంద్ర మంత్రి హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు నిలుస్తాయని పేర్కొన్నారు. ఈనేపథ్యాన ప్రజలంతా ఏకమై మోదీ ప్రభుత్వంపై పోరాడాలని కోరారు. ఈ విషయంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ఇంటింటా వివరించాలని సూచించారు. ఈసమావేశాల్లో మధిర మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, ఓబీసీ సెల్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, మధిర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణుతో పాటు మండలాల అధ్యక్షులు, నాయకులు సూరంశెట్టి కిషోర్, మిరియాల వెంకటరమణ గుప్తా, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, శీలం ప్రతాపరెడ్డి, తూమాటి నవీన్‌రెడ్డి, చావా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన కమ్యూనిస్టును కోల్పోయాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మం వన్‌టౌన్: సీపీఎం నాయకుడు యర్రా శ్రీకాంత్ మృతితో నిబద్ధత కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గుండెపోటుతో ఆదివారం మృతి చెందిన సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ మృతదేహం వద్ద ఆయన మంగళవారం నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ శ్రీకాంత్ కుటుంబం కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమై పనిచేసిందని, దశాబ్దాలుగా కార్మికులు, పేదల సంక్షేమం, హక్కుల సాధనకు పోరాడారని తెలిపారు. వివిధ పార్టీలు, యూనియన్ల నాయకులు బాగం హేమంతరావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, తాటి నిర్మల, ఏనుగు వెంకటేశ్వరరావు, నూనె శశిధర్, జ్వాలా నర్సింహారావు, ఎస్.శంకరరావు, రవీందర్, విజయ్ తదితరులు ఉన్నారు. అలాగే, యర్రా శ్రీకాంత్ మృతదేహం వద్ద ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కూడా నివాళులర్పించారు. వివిధ పార్టీల నాయకులు వై.లెనిన్, నవీన్‌రెడ్డి, జబ్బార్, మిక్కిలినేని నరేందర్, కొప్పుల చంద్రశేఖర్, కాసుగల రాధాకృష్ణ, ప్రముఖ న్యాయవాది స్వామి రమేష్ పాల్గొన్నారు.


ఖమ్మం మయూరిసెంటర్: సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావును ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మంగళవారం ఖమ్మంలో కలిసి యోగక్షేమాలు ఆరా తీశారు.


శ్రీకాంత్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కూనంనేని, నాయకులు

అన్నంలో బొద్దింక.. ఇడ్లీలో ఇసుక

ఇదీ సింగరేణి క్యాంటీన్ దుస్థితి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని సింగరేణి జేవీఆర్ ఓసీ క్యాంటీన్‌లో సరఫరా చేసే భోజన పదార్థాలు నాసిరకంగా ఉండడమే కాకా పురుగులు వస్తున్నాయని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు సోమవారం అన్నంలో బొద్దింక రాగా, మంగళవారం ఇడ్లీలో ఇసుక తగిలిందని తెలిపారు. సింగరేణి కార్మికులకు నాణ్యమైన ఆహారం అందించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో సింగరేణి ఆధ్వర్యాన నడిచిన క్యాంటీన్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో ఈ పరిస్థితి నెలకొందని హెచ్‌ఎంఎస్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, తదితరులు ఆరోపించారు. ఈమేరకు అధికారులతో పాటు గుర్తింపు సంఘాల నాయకులు స్పందించాలని డిమాండ్ చేశారు.


భోజనంలో వచ్చిన బొద్దింక

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కల్లూరు/పెనుబల్లి: తీవ్రగాయాలతో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందిన ఘటన ఇది. పెనుబల్లి మండలం ముత్తగూడెం – కల్లూరు మండలం ముగ్గువెంకటాపురం గ్రామాల మధ్య రోడ్డు పక్కన మంగళవారం తెల్లవారుజామున అపస్మారక స్థితిలో వ్యక్తి పడి ఉన్నాడు. ఆయన ఒంటిపై చొక్కా లేకపోగా, తీవ్ర గాయాలై ఉండడంతో ఓ లారీ డ్రైవర్ పెనుబల్లి మండలం ముత్తగూడెం చెక్‌పోస్టు సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. దీంతో వారు 108 సిబ్బందికి తెలపడంతో పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సదరు వ్యక్తి పడి ఉన్న ప్రాంతం కల్లూరు మండల పరిధిలోకి రావడంతో ఎస్‌ఐ హరిత విచారణ చేపట్టారు. మృతుడి కుడి భుజంపై సూర్యుడి గుర్తు పచ్చబొట్టు ఉందని, ఆయన ఆచూకీ తెలిసిన వారు 87126 59171, 87126 59172 నంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి..

ఏన్కూరు: మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న గుర్తుతెలియని వ్యక్తి(45) మండలంలోని హిమామ్‌నగర్ సమీపాన మంగళవారం మృతి చెందాడు. గ్రామ సమీపాన కోళ్లఫారం వద్ద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరుకుని పోలీసులు, గుర్తించారు. ఆయనకు కుడి చేయి లేకపోగా, ఒంటిపై నిక్కర్ మాత్రమే ఉండడంతో మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ బాధ్యుల సహకారంతో మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ రఫీ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు...

వేంసూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన వేంసూరు మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని వెంకటాపురంలో బంధువుల ఇంటికి వచ్చిన ఏలూరు జిల్లా చాట్రాయి మండలం నరసింహారావుపురానికి చెందిన నక్క రామస్వామి సోమవారం రాత్రి నడుస్తూ స్వగ్రామానికి వెళ్తున్నాడు.ఈక్రమాన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ వీరప్రసాద్ ఆయన మృతదేహాన్ని సత్తుపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ...

తల్లాడ: మండలంలోని మల్లవరంలో వడదెబ్బకు గురైన వ్యవసాయ కూలీ మంగళవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన గుడిపల్లి వెంకమ్మ(60) ఈనెల 4న గ్రామంలో పొలం పనులకు వెళ్లి వచ్చింది. ఆరోజు నుంచి నీరసమై వాంతులు, విరోచనాలు అవుతుండడంతో నారాయణపురంలో చికిత్స చేయించి, మంగళవారం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స మొదలైన గంటలోనే వెంకమ్మ మృతి చెందింది. ఆమె భర్త భాస్కర్‌రావు ఆరు నెలల క్రితమే అనారోగ్యంతో మృతి చెందగా, వారికి ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

ఇంటి ఎదుట నిలిపిన బైక్ చోరీ

నేలకొండపల్లి: మండల కేంద్రానికి పిట్టల వినయ్ ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ను మంగళవారం తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు చోరీ చేశారు. అందులో ఒకరు హెల్మెట్ ధరించగా, మరొకరు రుమాలు, టోపీతో ముఖం కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. ఈ ఘటనపై సీసీ పుటేజీలో నమోదైన చిత్రాల ఆధారంగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


చోరీ యత్నంలో యువకులు (సీసీ పుటేజీ)

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

ఖమ్మంక్రైం: ఖమ్మం శివారు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తుల ముఠాను ఎక్సైజ్ స్టేషన్–1 పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. చింతకాని మండలం బొప్పారానికి చెందిన ఖలీల్ పాషా, ఖమ్మంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పశువుల ఉదయ్‌కుమార్, బత్తుల వెంకటేష్, కొమ్మరబోయిన నవీన్ ఇండస్ట్రియల్ ఏరియాలో గంజాయి విక్రయిస్తుండగా మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 670 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ కృష్ణతో పాటు ఉద్యోగులు సాయిబాబా, రేష్మసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుదుత్పత్తి చేయాలి

- జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా
- మణుగూరు, పాల్వంచలో పర్యటన

మణుగూరు రూరల్/పాల్వంచ: బీటీపీఎస్, కేటీపీఎస్‌ల నుంచి నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేయాలని టీజీ జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా సూచించారు. ఆయన మణుగూరు బీటీపీఎస్, పాల్వంచలోని కేటీపీఎస్ ప్లాంట్లను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలను విద్యుత్ కోతల నుంచి విముక్తి చేసేందుకు, విద్యుత్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో పలు పవర్ ప్రాజెక్టులు నిర్మిస్తూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతోందన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేసేంతగా తెలంగాణ ఎదిగిందని తెలిపారు. అనంతరం కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో జెన్‌కో ట్రెనింగ్ సెంటర్‌ను సందర్శించి శిక్షణ పొందుతున్న ఇంజనీర్లతో ముఖాముఖిగా మాట్లాడారు. శిక్షణతో సాంకేతిక పరిజ్ఞానం ఎంత మేర కలిగిందనే అంశంపై ఆరా తీశారు. ఆ తర్వాత కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. బీటీపీఎస్ రైల్వే లైన్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని జరుగుతున్న ఆందోళన, తీసుకోవాల్సిన నిర్ణయాలపై కలెక్టర్‌తో సీఎండీ చర్చించినట్లు సమాచారం.